

చల్లపల్లిలో సొమ్మసిల్లిపడిపోయి..

● కంకిపాడు మండలం గంగూరులో వజ్రమ్మ (75) అనే వృద్ధురాలు పింఛన్ కోసం ఎదురుచూస్తూ ఇంటి వద్దే కింద పడిపోయి చనిపోయింది.

● చల్లపల్లిలో పొన్న సుబ్బారావు అనే వృద్ధుడు పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

● బాపులపాడు మండలం కొత్తపల్లిలో ఓ వృద్ధురాలు నడవలేని పరిస్థితిలో ఉన్నా.. ఆమెను స్థానిక వైసీపీ నాయకులు సచివాలయానికి తీసుకొచ్చారు. నడవలేని పరిస్థితిలో ఉన్న ఆమెను యాంగ్యులర్ సాయంతో అలాగే నిలబెట్టారు. వైసీపీ నాయకులు కావాలనే ఆ వృద్ధురాలిని తీసుకొచ్చారని తెలిసింది.

..ఇలా అనేక నరకయాతనల నడుమ వైసీపీ నాయకుల యాక్షన్‌లో, వలంటీర్ల డైరెక్షన్‌లో బుధవారం రెండు జిల్లాల్లో పెన్షన్ల పంపిణీ జరిగింది. ఇదిగో అదిగో.. అంటూ ఎండలో వృద్ధులు, దివ్యాంగులను సచివాలయాల సిబ్బంది ముప్పుతిప్పలు పెట్టగా, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ ఎక్కడికక్కడ వైసీపీ నాయకులు పెన్షన్‌దారులను ఆటోల్లో సచివాలయాలకు తరలించారు. ఇక చాలాచోట్ల వలంటీర్ల పర్యవేక్షణలోనే పింఛన్లు ఇప్పించడం వివాదాస్పదమైంది.



యనమలకుదురు సచివాలయం వద్ద రద్దీ

ఎండలో ఏడీ పింఛేన్



యనమలకుదురు సచివాలయం వద్ద నడవలేని స్థితిలో వృద్ధురాలు, కానూరులో నడవలేక వచ్చిన వృద్ధుడికి పెన్షన్ అందక నిరాశతో వెనక్కి వెళ్లిపోతూ..

సచివాలయాల సిబ్బంది ఓవరాక్షన్

- పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులకు ముప్పుతిప్పలు
- ఎండలో అష్టకష్టాలు పడిన ముదుసలులు
- పింఛన్‌దారులను ఆటోల్లో తిప్పిన వైసీపీ నాయకులు
- సచివాలయాల వద్దే వలంటీర్ల తిష్ట
- నడవలేని స్థితిలోనూ వచ్చిన దివ్యాంగులు
- రాత్రి 7.30 గంటల వరకూ సాగిన పంపిణీ
- కొన్నిచోట్ల అరకొరగానే.. వచ్చినవారు వెనక్కి..

వలంటీర్ల డైరెక్షన్.. వైసీపీ నాయకుల యాక్షన్..

మచిలీపట్నం/విజయవాడ, ఆంధ్రజ్యోతి : రెండు జిల్లాల్లో కొన్నిచోట్ల బుధవారం మధ్యాహ్నం, మరికొన్నిచోట్ల సాయంత్రం పింఛన్ల పంపిణీ జరిగింది. కదల్లేని స్థితిలో ఉన్న వారందరికీ ఇంటికి వెళ్లి పెన్షన్లు ఇవ్వాల్సి ఉన్నా.. అలా చేయలేదు. సచివాలయాలకు రావాల్సిందేనని ఆదేశించారు. కొందరు తాము ఆసుపత్రుల్లో ఉన్నామని, రాలేమని చెప్పినా వినిపించుకోలేదు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల సహనానికి పరీక్ష పెట్టారు. కొన్నిచోట్ల పింఛన్లు ఎప్పుడిస్తారో తెలియక బుధవారం ఉదయం నుంచే పింఛన్‌దారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. ఉదయం 10.30 గంటలకు సచివాలయాలు తెరిచినా.. ఇంకా నగదు చేతికందలేదని, మధ్యాహ్నం లేదా సాయంత్రం ఇస్తామని సచివాలయ సిబ్బంది చెప్పి పంపేయడంతో వృద్ధులు, దివ్యాంగులు వెనుదిరిగారు. కొన్నిచోట్ల రాత్రి 7.30 గంటల వరకూ పెన్షన్ పంపిణీ జరిగింది. చాలా సచివాలయాల పరిధిలో డబ్బు సరిపడా తీసుకురాలేదు.

ఎక్కడికక్కడ వైసీపీ మాయ

ఎక్కువ మంది వృద్ధులను రప్పించేందుకు అధికార పార్టీ నాయకులు ఫోన్లు మీద ఫోన్లు చేశారు. దీంతో సచివాలయాల వద్ద రద్దీ ఏర్పడింది.

- మిగతా 6లో



కానూరు సచివాలయంలో నిలబడిన వృద్ధులు







పెన్షన్ కోసం కాళ్లు ఈడ్చుకుంటూ వస్తున్న ముదుసలులు, మచిలీపట్నం సచివాలయం వద్ద వలంటీర్ల పర్యవేక్షణ

జిల్లాలో ఇలా..

అధికారుల లెక్కల ప్రకారం కృష్ణాజిల్లాలో 2,44,262 మంది సామాజిక పింఛన్ తీసుకునే వారున్నారు. వీరికి పింఛన్ల రూపంలో రూ.72 కోట్లు ఇవ్వాలి. బుధవారం సాయంత్రానికి రూ.68 కోట్లే బ్యాంకుల నుంచి డ్రా చేశారు. మిగిలిన రూ.4 కోట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి డ్రా చేయాల్సి ఉండగా, సాంకేతిక కారణాలతో కుదరలేదు. బుధవారం రాత్రి 7 గంటల సమయానికి కృష్ణాజిల్లాలో 80 వేల మందికి పింఛన్ అందజేశామని, రాత్రి పొద్దుపోయే వరకు 50 శాతం మందికి అందజేయాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు డీఆర్‌డీఎ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. లేవలేని స్థితిలో ఉన్నవారికి సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లి ఇస్తారన్నారు.

కాల్‌కూట విషం

పెన్షన్ల జాప్యంపై ఐవీఆర్ఎస్ వాయిస్ కాల్స్



- ప్రతిపక్షాల వల్లే ఈ పరిస్థితి అని రికార్డింగ్
- మంగళవారం నుంచి ప్రతి పెన్షన్‌దారుడికి..
- వైసీపీ సోషల్ మీడియాలో నకిలీ వీడియోలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పెన్షన్ల పంపిణీపై కుట్రకు తెరలేపిన అధికార పార్టీ.. ప్రతిపక్షాలే టార్గెట్‌గా విషం చిమ్మింది. ఇందుకు వీలుగా ఐవీఆర్ఎస్ అస్త్రాన్ని ప్రయోగించింది. పెన్షన్ల పంపిణీ జాప్యానికి టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణే కారణమని వేర్వేరుగా ఫోన్‌కాల్స్ చేసింది. అపరిచిత ఫోన్ నెంబర్లతో వచ్చిన కాల్స్‌ను లిఫ్ట్ చేయగానే.. పెన్షన్ల పంపిణీలో జాప్యం ప్రతిపక్షాల వల్లేనని అధికార పార్టీ తయారు చేయించిన రికార్డింగ్ వినిపించింది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఈ కాల్స్ వస్తూనే ఉన్నాయి. ప్రతిపక్షాల కుట్రల వల్ల పెన్షన్‌దారులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని, వలంటీర్ల ద్వారా ఇంటింటికీ మంచి జరుగుతుంటే, ఎన్నికల సమయంలో కక్షకట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆ కాల్స్‌లో వినిపించారు. అధైర్యపడొద్దని, సచివాలయాల్లో పంపిణీ చేయటానికి అన్ని ఏర్పాట్లు చేశామని, ఆధార్ కార్డులను తీసుకుని రావాలని చెప్పారు. వాస్తవానికి వలంటీర్ల నిలుపుదల అనేది ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం. ఓటర్లను ప్రభావితం చేసేలా, రాజకీయ సంఘర్షణలకు తావిచ్చేలా వచ్చిన ఐవీఆర్ఎస్ వాయిస్ కాల్స్ ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తాయి. వీటిపై తక్షణం ఎన్నికల సంఘం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం

వైసీపీ సోషల్ మీడియా విభాగం కూడా విష ప్రచారం చేసింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్, వాట్సాప్ కమ్యూనిటీ గ్రూపులు, సచివాలయాల గ్రూపులు, వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల్లోనూ పలు పోస్టులు పెట్టారు. నకిలీ వీడియోలు కూడా హల్‌చల్ చేశాయి. తమ వద్దకు వచ్చిన వృద్ధుల పట్ల ప్రేమ నటించడం, వృద్ధులు రాగానే వారిని లోపలికి తీసుకెళ్లడం, కుర్చీల్లో కూర్చోబెట్టడం, మంచినీరు, మజ్జిగ ఇవ్వటం వంటివి చేశారు. వీటిని కూడా వైసీపీ సోషల్ మీడియా విభాగం చిత్రీకరించింది.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

పెద్ద మనుషులు కదా అని కుమార్తె శుభకార్యానికి ఆహ్వానించారు. అక్కడికి వచ్చి అందరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నాళ్లిలా ఖాళీగా ఉంటారు.. మాకున్న పరపతితో అంగన్వాడీ విభాగం సూపర్‌వైజర్ గ్రేడ్-2 పోస్టు ఇప్పిస్తామని నమ్మబలికారు. ఇందుకోసం రూ.10 లక్షలు ఇవ్వాలని బేరం పెట్టారు. అంత ఇచ్చుకోలేమని చెబితే, రూ.50 వేలు తగ్గించారు. ఇది నమ్మినవారు విడతలవారీగా రూ.7.65 లక్షలు అప్పజెప్పారు. అంత పెద్ద మొత్తం ముట్టాక మీకు పోస్టు ఖాయమంటూ నమ్మించారు. జడ్పీ చైర్‌పర్సన్ కారులో తిరుగుతామంటూ హడావిడి చేశారు. చివరికి ఏడాదిన్నరగా ఉద్యోగం ఇప్పించకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ప్రశ్నించిన వారిపైకి కుక్కలను వదిలారు. న్యాయం చేయాల్సిన పోలీసులు కేసు నమోదు చేయకుండా తొక్కిపెట్టేశారు. న్యాయస్థాన జోక్యంతో బుధవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలను బాధితులు బుధవారం కోర్టు వద్ద విలేకరులకు వివరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు

చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు, ఆమె భర్త నిర్వాకం

- రూ.9.50 లక్షల వరకూ వసూలు
- ప్రశ్నించిన వారిపై కుక్కలతో దాడి
- పట్టించుకోని చల్లపల్లి పోలీసులు
- మొవ్వ కోర్టు జోక్యంతో విషయం వెలుగులోకి..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : చల్లపల్లి మండలం లక్ష్మీపురానికి చెందిన మేకల శ్రీనివాస్ పంచాయతీ ఏడో వార్డు మెంబర్‌గా ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. పంచాయతీ సభ్యుడు కావడంతో చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, ఆమె భర్త శివప్రసాద్‌తో పరిచయం పెంచుకున్నారు. 2022, డిసెంబరు 27వ తేదీన శ్రీనివాస్ కుమార్తెకు సంబంధించిన శుభకార్యానికి జెడ్పీటీసీ సభ్యురాలిని ఆహ్వానించారు. ఈ వేడుకకు హాజరైన కల్యాణి, ఆమె భర్త శివప్రసాద్.. శ్రీనివాస్ భార్య సుమలతకు అంగన్వాడీలో గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్ట్ ఇప్పిస్తామని నమ్మించారు. జెడ్పీటీసీ కోటాలో తమకు 10 పోస్టులు ఇచ్చారని, వాటిలో ఒకటి మీకు ఇస్తామన్నారు. రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. తొలివిడతగా రూ.లక్ష ఇస్తే పోస్టును రిజర్వు చేస్తామని చెప్పడంతో శ్రీనివాస్ దంపతులు ఆ మొత్తాన్ని ఇచ్చారు. మరో నెల రోజులకు ఫోన్‌చేసి మిగిలిన నగదు ఇవ్వాలని చెప్పడంతో తమకున్న 4.40 సెంట్ల భూమిని తాకట్టుపెట్టి రూ.6 లక్షలు ఇచ్చారు. 2023, ఫిబ్రవరి 12న కలెక్టరేట్‌కు వస్తే అధికారులతో మాట్లాడి ఉద్యోగ ఉత్తర్వులు అందజేస్తామని చెప్పి కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. వీరిని అక్కడే ఉంచి కలెక్టర్ చాంబర్‌కు వెళ్లి అంతా మాట్లాడామని, పది రోజుల్లో ఉత్తర్వులు వస్తాయని చెప్పి వెళ్లిపోయారు. 2023, ఏప్రిల్ 30న శ్రీనివాస్‌కు జెడ్పీటీసీ సభ్యురాలి భర్త శివప్రసాద్ ఫోన్‌చేసి అపాయింట్‌మెంట్ ఆర్డర్ వస్తుందని, మిగిలిన నగదును ఇవ్వాలని కోరాడు. దీంతో బాధితులు రూ.65 వేలు తమకు తెలిసిన వారి ఖాతా నుంచి గూగుల్‌పే ద్వారా జెడ్పీటీసీ భర్త ఖాతాలో జమ చేశారు.

మోసపోయామని తెలుసుకుని..

ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో తాము ఇచ్చిన నగదును తిరిగి ఇవ్వాలని జెడ్పీటీసీ సభ్యురాలి భర్తపై శ్రీనివాస్ ఒత్తిడి తెచ్చారు. దీంతో 2023, జూన్ 6వ తేదీన నగదు ఇస్తాం, ఇంటికి రమ్మని శివప్రసాద్ పిలిచాడు. మధ్యవర్తుల ద్వారా కబురు పంపాడు. మధ్యవర్తి మాటలు నమ్మి ఇంటికి వెళ్లిన బాధితులతో జెడ్పీటీసీ భర్త వాగ్వాదానికి దిగి ఈ విషయం ఎక్కడైనా చెప్పినా, మళ్లీ నగదు అడిగినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా కారుతో ఢీకొట్టి చంపేస్తామని బెదిరించాడు. శ్రీనివాస్ అక్కడి నుంచి వెళ్లిపోతుండగా, నాలుగు కుక్కలను వదిలి దాడి చేయించాడు. ఆ దాడిలో గాయపడిన శ్రీనివాస్ మూడు రోజుల పాటు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాడు. ఇంటికి వచ్చిన అనంతరం బాధితుడు చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు పట్టించుకోలేదు. దీంతో బాధితుడు తనకు జరిగిన అన్యాయంపై మొవ్వ కోర్టును ఆశ్రయించాడు. మొవ్వ న్యాయస్థానం విచారణ చేసి, కేసు నమోదు చేసి నివేదికను పంపాలని 867/2024 నెంబరుతో ఆదేశాలు జారీ చేసినట్లు బాధితులు తెలిపారు. దీనిపై చల్లపల్లి పోలీసులను వివరణ కోరగా, ఇంకా కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, వచ్చిన వెంటనే విచారణ చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

ఉద్యోగమంటూ వసూళ్లు

రూ.3.50 లక్షలు తీసుకున్న వైసీపీ నాయకుడు

● మోసపోయి పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

గుడివాడ, ఏప్రిల్ 3 : ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి వైసీపీ నాయకుడు వెంపటి సైమన్ తన వద్ద రూ.3 లక్షలు తీసుకుని మోసం చేశాడని రైలుపేటకు చెందిన బాధితుడు వేల్పుల బద్రీనాథ్ బుధవారం పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి వివరాల ప్రకారం.. హైకోర్టులో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని గుడివాడకు చెందిన వైసీపీ నాయకుడు వెంపటి సైమన్ విజయవాడకు చెందిన కరీముల్లా ద్వారా ఆర్థిక లావాదేవీలు జరిపాడు. తెలిసిన వ్యక్తి కావడంతో బద్రీనాథ్‌కు రూ.50 వేలు తగ్గించాడు. వెంటనే తన ఫోన్‌పేకు రూ.50 వేలు పంపాలని సైమన్ చెప్పడంతో బద్రీనాథ్ చెల్లించాడు. ఇలా మొత్తంగా రూ.3 లక్షలు తీసుకున్నారని, తీరా హైకోర్టులో కాకుండా పంచాయతీరాజ్‌లో అటెండర్ పోస్టు అని చెప్పి మోసం చేశారని కన్నీటి పర్యంతమయ్యారు. తన తండ్రితో కలిసి విజయవాడ వెళ్లి వాకబు చేయగా, తాము పంచాయతీరాజ్‌లోనే ఉద్యోగం ఇప్పిస్తామని తెలిపామని, కావాలంటే సైమన్‌ను అడగమని కరీముల్లా తెగేసి చెప్పాడు. అయితే, తనకు ఉద్యోగ నియామక పత్రం ఇవ్వాలని బద్రీనాథ్ డిమాండ్ చేయడంతో సైమన్‌తో మాట్లాడుకోమని కరీముల్లా చెప్పి పంపించేశాడు. సైమన్‌ను నిలదీయగా, తనకు చెల్లించిన రూ.50 వేలు ఇచ్చేస్తానని, మిగతా డబ్బు ఇవ్వలేనని, కరీముల్లా ఎవరో, ఎప్పుడు వచ్చాడో, డబ్బు ఎప్పుడు తీసుకెళ్లాడో కూడా తెలియదని వాదించాడు. తాను వైసీపీ నాయకుడినని, చేతనైంది చేసుకోమని సైమన్ బెదిరించాడు. పోలీసులను ఆశ్రయించిన బద్రీనాథ్ తనకు న్యాయం చేయాలని కోరాడు.



మహిళా వలంటీర్‌తో పాదపూజ

ఎమ్మెల్యే కొడాలి నానిపై మండిపడుతున్న మహిళా సంఘాలు

గుడివాడ, ఏప్రిల్ 3 : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లను ఎన్నికల కమిషన్ విధుల నుంచి తొలగిస్తుంటే.. గుడివాడలో మహిళా వలంటీర్లు ఏకంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాళ్లకు పాలాభిషేకం చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వారం రోజులుగా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా కొందరు మహిళలతో ఆయన కాళ్లకు పాలాభిషేకం చేయించుకున్నారు. ఎమ్మెల్యే కాళ్లకు పాలాభిషేకం చేసిన వారిలో మహిళా వలంటీర్లు కూడా ఉన్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గుడివాడ పట్టణంలోని 13వ వార్డుకు చెందిన వలంటీర్ హారిక ముఖానికి స్కార్ఫ్ ధరించి నాని కాళ్లకు పాలాభిషేకం చేసింది. కాగా, ఎమ్మెల్యే నాని ఏం సాధించారని మహిళలతో కాళ్లు కడిగించుకున్నారని మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

నేడు కాలువలకు తాగునీరు విడుదల

- 6లో..

- చెరువులను పూర్తిస్థాయిలో నింపండి
- ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశాలు

ఇంద్రకీలాద్రిపై 9 నుంచి వసంత నవరాత్రులు

19 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు : ఈవో రామారావు

- 6లో..



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం): 6-25 (గురు)

సహర్ (ఉదయం): 4-40 (శుక్ర)



వసంత నవరాత్రి ఉత్సవాల బ్రోచర్ విడుదల చేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రిపై 9 నుంచి వసంత నవరాత్రులు

» 19 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు : ఈవో రామారావు



వన్‌టౌన్, ఏప్రిల్ 3 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 9వ తేదీ నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయ పూజాధికాలలో రోజుకో రకం పుష్పాలతో అమ్మవారిని అర్చించనున్నట్టు ఈవో కేఎస్ రామారావు తెలిపారు. మహామండపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఏఈవో రమేష్ బాబు, ఈఈ లింగం రమాదేవి, వైదిక కమిటీ సభ్యులతో కలిసి బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈనెల వసంతనవరాత్రులను పురస్కరించుకుని సంప్రదాయంగా వస్తున్న విధివిధానాల మేరకు రోజుకో రకం పూలతో అమ్మవారిని అర్చించనున్నట్టు తెలిపారు. 9న మల్లెపూలు, మరువం, 10న కనకాంబరాలు, గులాబీలు, 11న చామంతి ఇతర పూలు, 12న మందార, ఎర్రకలువలు, 13న తెల్లజిల్లేడు, మారేడు, తులసి, మరువం, దవనం, 14న కాగాడ మల్లెలు, జాజులు, మరువం, 15న ఎర్రతామరలు, ఎర్రగన్నేరుపూలు, సన్నజాజులు, 16న చామంతులు, సంపెంగలు, 17న కనకాంబరాలు, గులాబీలు, 18న వివిధ రకాల పుష్పాలతో అర్చించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు భక్తుల పూలను విరాళంగా ఇవ్వవచ్చన్నారు. లక్ష్మీగణపతి స్వామి మందిరం వద్ద పుష్పార్చనలో పాల్గొనదలచిన దంపతులు రూ.2,500 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూజ అనంతరం అంతరాలయ దర్శనం, శేషవస్త్రం, రవిక, అమ్మవారి చక్ర పీఠం, పెద్దలడ్డూ ప్రసాదంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి పుష్పార్చనలు ప్రారంభమవుతాయని. 18వ తేదీ పూర్ణాహుతితో ముగుస్తాయని తెలిపారు. ఉగాది పర్వదినాన సాయంత్రం 5.30గంటలకు మల్లికార్జున మహామండపం నుంచి వెండి రథోత్సవం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉగాది రోజున అమ్మవారి సేవలు నిలుపుదల చేస్తారు. 9 నుంచి 24వ తేదీ వరకు వసంతనవరాత్రులు, చైత్ర మాస బ్రహ్మోత్సవాల కారణంగా రుద్రహోమం, మృత్యుంజయ హోమాలను నిలుపుదల చేస్తారు. ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు 9 రోజుల పాటు శాంతి కల్యాణం, పల్లకిసేవలను నిలుపుదల చేస్తారు. ప్రతి నిత్యం ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే ఆర్జిత సేవలు ఉగాది రోజు అరగంట ఆలస్యంగా ప్రారంభిస్తామని భక్తులు వీటిని గమనించాలని కోరారు. 9వ తేదీ ఉగాది రోజున సుప్రభాత సేవ అనంతరం వేకువజామున 3గంటలకు గర్భాలయంలోని అమ్మవారికి ఉపాలయాలలో ఉన్న దేవతామూర్తులకు స్నపనాభిషేకం నిర్వహిస్తారు. అలంకారం, అర్చన, నివేదన, హారతి అనంతరం ఉదయం 8గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుంది. ఉదయం 8.15 గంటలకు వసంతనవరాత్రోత్సవాలకు సంబంధించి కలశస్థాపన అనంతరం ప్రత్యేక పుష్పార్చనలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు ధర్మపదం వేదికపై పంచాంగ శ్రవణ కార్యక్రమం జరుగుతుంది. 4 గంటలకు మండపపూజ, అగ్నిప్రతిష్ఠాపన, రుద్రహోమం కార్యక్రమాలను యాగశాలలో నిర్వహిస్తారు. 16వ తేదీన చైత్రశుద్ధ అష్టమినాడు క్షేత్ర పాలక ఆంజనేయస్వామివారికి అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాలు జరుగుతాయి. 17వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతారాముల కళ్యాణోత్సవాన్ని ధర్మపదం కళావేదికపై నిర్వహిస్తారు. 18వ తేదీన వసంతనవరాత్రోత్సవాలకు సంబంధించి పూర్ణాహుతి నిర్వహిస్తారు. అదేరోజు 11 గంటలకు శ్రీరాముల వారి పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 24వ తేదీ ఉదయం పూర్ణాహుతి, ధాన్య కొట్నోత్సవం వసంతోత్సవం అవభృత స్నానం, మూకబలి, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు సమాప్తి అవుతాయి. సాయంత్రం గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులకు పవిత్ర కృష్ణా నదిలో తెప్పోత్సవం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 19వ తేదీన వెండిపల్లకి, 20 వతేదీ రావణవాహనం, 21 వతేదీ వెండి రథోత్సవం, 22 వతేదీ నంది వాహనం, 23 వతేదీ సింహవాహన సేవలు ఉంటాయి.

నేడు కాలువలకు తాగునీరు విడుదల

» చెరువులను పూర్తిస్థాయిలో నింపండి

» ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశాలు



మచిలీపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తాగునీటి అవసరాల కోసం ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం నీటిని విడుదల చేస్తారని, అధికారులు తీరప్రాంతంలోని తాగునీటి చెరువులను నింపేందుకు అన్నిచర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. కలెక్టర్ చాంబరులో బుధవారం ఆమె వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జలవనరులశాఖ అధికారులు జిల్లాలో తాగునీటి అవసరాలకోసం మాత్రమే కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారని ఆమె తెలిపారు. కాలువల ద్వారా వచ్చేనీటిని సముద్రతీరం వెంబడి ఉన్న ప్రాంతాల్లోని చెరువులను పూర్తిస్థాయిలో నింపేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన మండలాల్లో తాగునీటి చెరువులను నింపేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తాగునీటిని ఇతర అవసరాలకు మళ్లించకుండా ఏర్పాటుచేసిన బృందాలు కాలువల వెంబడి నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. వేసవి తీవ్రతపై వాతవరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు కనీస అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, మునిసిపల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



తాబేలు పిల్లలను సముద్రంలోకి వదులుతున్న అధ్యాపకులు తదితరులు

సముద్రంలోకి ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలు

కోడూరు, ఏప్రిల్ 3 : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.ఉమారాణి మార్గదర్శకంలో జాతీయ సేవా పథకం, ఏకో క్లబ్, ఆక్వా కల్చర్ విభాగాల ఆధ్వర్యంలో జీవ వైవిధ్య పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా కోడూరు మండలంలోని హంసలదీవి వద్ద ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలారు. అంతరించిపోతున్న జాతుల్లో ఒకటైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు తెలియచెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగాధిపతులు వీర కుమారి, రవిబాబు, ఏకో క్లబ్ విభాగం అధ్యాపకులు నాగార్జున, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అరకొరగానే.. పింఛన్ల పంపిణీ

» సచివాలయ కేంద్రాల వద్ద కానరాని ఏర్పాట్లు

» ఎండలో తీవ్ర ఇబ్బందులు పడిన వృద్ధులు

పెనమలూరు, ఏప్రిల్ 3 : అవ్వా తాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు బుధవారం చేపట్టిన పింఛన్ల పంపిణీ సగంకూడా పూర్తికాలేదు. పెనమలూరు తాడిగడప మునిసిపాలిటీల్లో సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ వద్ద కనీసం మంచినీటి వసతి కూడా లేక వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూరల్ మండల పరిధిలో మొత్తం పింఛన్లు 5817 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా కేవలం 2757 మందికి మాత్రమే పంపిణీ చేశారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో 12885 పంపిణీ చేయాల్సి ఉండగా కేవలం 5066మందికి మాత్రమే పంపిణీ చేశారు. మొత్తం మీద కనీసం సగం కూడా పంపిణీ జరగలేదు. కానూరు నాల్గవ సచివాలయ పరిధిలో ఇరవై రెండు లక్షల రూపాయలకు పైగా పింఛన్ల సొమ్ము అవసరం ఉండగా అడ్మిన్ ఖాతాకు కేవలం ఎనిమిది లక్షలు మాత్రమే క్రెడిట్ అవడంతో పింఛను పొందకుండానే వెనుదిరిగారు. తాడిగడప కార్మికనగర్ సచివాలయ పరిధిలో పింఛన్ల నిమిత్తం పదమూడు లక్షల రూపాయలకు పైగా అవసరముండగా అడ్మిన్ ఖాతాకు కేవలం ఐదు లక్షలే జమ వడంతో ఇక్కడ కూడా అవ్వాతాతలు నీరసంగా ఇంటి ముఖం పట్టారు. మరో రెండు రోజుల పాటు పంపిణీ చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా

» కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



హనుమాన్‌జంక్షన్‌రూరల్/గన్నవరం, ఏప్రిల్ 3 : ప్రజలను ప్రలోభాలకు గురిచేసే నగదు, వస్తువులతో పాటు మద్యం, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్టు కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. బొమ్ములూరు వద్ద చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. గంజాయి తరలిస్తున్న వాహనాన్ని పరిశీలించి సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రయాణ సమయంలో రూ.50వేలకు మించి నగదు ఉంటే తప్పనిసరిగా సంబంధిత పత్రాలు చూపాలని సూచించారు. డీఎస్పీ జయసూర్య, ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, సీఐ నరసింహమూర్తి, ఎస్సై జనార్ధన్, అర్జమ్మ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. కేసరపల్లి వద్ద చెక్ పోస్టును బుధవారం ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మిలు ఆకస్మిక తనిఖీ చేశారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు.

కారులో తరలిస్తున్న 30కిలోల గంజాయి స్వాధీనం



కారులో గంజాయి ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 3 : ఎన్నికల నేపథ్యంలో జాతీయరహదారిపై వాహనతనిఖీల్లో కారులో తరలిస్తున్న 30 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్ములూరు వద్ద బుధవారం సీఐ నరసింహమూర్తి, హనుమాన్‌జంక్షన్ ఎస్సై అర్జమ్మలతో కలిసి తనిఖీలు చేపట్టారు. పూనేకు చెందిన దీపక్ అబాజీ పుపే, ప్రానిక్ ప్రసాద్ జాదవ్‌లు విజయనగరం నుంచి పూణేకు కారు డిక్కీలో 15 ప్యాకెట్లలో సుమారు 30 కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని, కారును స్వాధీనం చేసుకుని జంక్షన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదే సమయంలో కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, డీఎస్పీ జయసూర్య చెక్‌పోస్ట్ వద్ద ఆకస్మిక తనిఖీల్లో పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

» ఆర్డీవో వాణి



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 : అక్రమాలకు పాల్పడితే ఎవరైనా చర్యలు తప్పవని మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి హెచ్చరించారు. బుధవారం తన చాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అనుసరించి అధికారులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఫేక్ పట్టాలు ఇస్తున్నారన్న ఆరోపణలపై ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో 11వ డివిజన్‌లో ఫేక్ పట్టాతో లబ్ధిదారుడు తన వద్దకు వచ్చాడని, పట్టాలో సరిహద్దులు కానీ, సర్వే నెంబర్లు కానీ లేవన్నారు. దీనిపై విచారణ చేసి డివిజన్‌కు చెందిన వీఆర్వో శ్రీదేవిని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ సస్పెండ్ చేశారన్నారు. శ్రీదేవికి ఈ పట్టా ఇచ్చినట్టు తెలిసినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లకపోవడం వల్ల సస్పెండ్ చేశామన్నారు. వాస్తవాలను వెల్లడించకుండా అలసత్వం చూపిన వారిపై చర్యలు తప్పవన్నారు.

ఫిర్యాదులు పెడచెవిన పెట్టారు

» వైసీపీ నేతల అక్రమాలను ప్రోత్సహించినందుకే కలెక్టర్, ఎస్పీ జాషువాలపై వేటు : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3 : వైసీపీ నాయకుల అక్రమాలను ప్రోత్సహించినందునే కృష్ణా కలెక్టర్ రాజాబాబు, చిత్తూరు ఎస్పీ జాషువాలపై ఎన్నికల కమిషన్ వేటు వేసిందని, ఇప్పటికైనా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం పోతేపల్లిలో విలేకరుల సమావేశంలో రవీంద్ర మాట్లాడారు. వైసీపీ నాయకుల దొంగ ఓట్ల వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లగా.. కోర్టులో కేసు నడిచిందన్నారు. అప్పటి ఆర్డీవో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారన్నారు. ఇంత జరిగినా కలెక్టర్ పట్టించుకోలేదన్నారు. నకిలీ పట్టాలపై పలు పర్యాయాలు ఫిర్యాదులు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినా పట్టించుకోలేదన్నారు. అక్రమంగా అధికార పార్టీ నేతలు వందలాది ట్రక్కుల్లో మట్టిని తవ్వుకు పోతున్నారని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రతిసారీ ఎమ్మెల్యే పేర్ని నానికి, వైసీపీ నేతలకు కలెక్టర్ కొమ్ము కాసారన్నారు. గతంలో కృష్ణా ఎస్పీగా ఉన్న జాషువా వైసీపీ అధికార పెద్దల మాటలు విని అక్రమంగా టీడీపీ కార్యకర్తలపై కేసులు బనాయించారన్నారు. మంత్రి జోగి రమేశ్ వత్తిళ్లతో పెడన సర్కిల్‌లో పనిచేస్తున్న పోలీసు సిబ్బందిని పెనమలూరుకు బదిలీ చేశారన్నారు. మచిలీపట్నంలో పేర్నినానికి అనుకూలమైన సిబ్బందిని బదిలీ చేయకుండా అక్కడే ఉంచేశారన్నారు. ఎస్పీ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్న సీఐలు, ఎస్సైలను బదిలీ చేయాలన్నారు. వీటిపై ఈసీ దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కుంచే నాని, దిలీప్, చిన్నం శివ, జనసేన నాయకులు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర



పెరిశేపల్లి గ్రామంలో పోలీసులు గుర్తించిన చీరల బండిల్స్

కృష్ణాలో రూ.10లక్షల విలువైన చీరల బండిల్స్ పట్టివేత

పామర్రు, ఏప్రిల్ 3 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన రూ.10 లక్షల ఖరీదుచేసే 7680 చీరలను కృష్ణాజిల్లా పామర్రు పరిధిలోని పెరిశేపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పెరిశేపల్లికి చెందిన చాపరాల వెంకటరమణ ఇంట్లో చీరల బండిల్స్ ఓటర్లకు పంచేందుకు దిగుమతిచేసుకున్నట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో సిబ్బంది తనిఖీ చేశారు. పోలీసులు జరిపిన సోదాల్లో 46 బండిల్స్ లభ్యమైనట్టు తెలిపారు. చీరల బండిల్స్‌ను సీజ్‌చేసి కేసు విచారణ జరుపుతున్నామన్నారు. తనిఖీల్లో పామర్రు సీఐ శుభాకర్, ఎస్సై పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పాల్గొన్నారు. అయితే గ్రామంలోని ప్రముఖ ఆలయంలో ఉత్సవాల కోసం వాటిని తీసుకొచ్చినట్టుగా గ్రామస్థులు చెబుతున్నారు.

ఎమ్మెల్సీ రుహుల్లాపై కేసు నమోదు

పాయకాపురం, ఏప్రిల్ 3 : వైసీపీ ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాపై నున్న రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఓ మసీదు కమిటీకి డబ్బులు పంపిణీ చేసిన విషయమై ఎలక్షన్ కమిషన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. పాయకాపురం 64వ డివిజన్ కండ్రిక కాలనీలో గత నెల 24వ తేదీ ప్రార్థనల పేరుతో ఎమ్మెల్సీ రుహుల్లా మసీదుకు వెళ్లారు. అనంతరం ఏ కారణం లేకుండా మసీదు కమిటీ పెద్దలకు రూ.2 లక్షల నగదును అందజేశారు. ఈ విషయమై సమాచారం తెలుసుకున్న ఎలక్షన్ కమిషన్ అధికారులు ఆరా తీశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా మసీదు పెద్దలకు నగదును ఇవ్వడం చట్టరీత్యా నేరం కావడంతో ఆతడిపై ఎన్నికల అధికారులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించినందుకుగాను సెక్షన్ 188 ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై భారీగా ఫిర్యాదులు

» సీ విజిల్‌కు 281, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసు పోర్టల్ ద్వారా 235 ఫిర్యాదులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో, ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా ఓటర్ల ప్రలోభాలు, డబ్బు, మద్యం పంపిణీ, కోడ్ ఉల్లంఘనలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 720 ఫిర్యాదులు అందాయి. సీ-విజిల్ మొబైల్ అప్లికేషన్ అత్యధికంగా 281 ఫిర్యాదులు వచ్చాయి. నేషనల్ గ్రీవెన్స్ సర్వీసు పోర్టల్ ద్వారా అత్యధికంగా 235 ఫిర్యాదులు వచ్చాయి. ఓటర్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ 1950 ద్వారా 67 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా కంట్రోల్‌రూమ్‌లో ఏర్పాటు చేసిన వాట్సాప్ నెంబర్ 9154970454కు అత్యల్పంగా 18 ఫిర్యాదులు వచ్చాయి. కాల్‌సెంటర్ నెంబర్ 0866-2570051కు 18 ఫిర్యాదులు వచ్చాయి. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా 32 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాకు సంబంధించి నేరుగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) మెయిల్‌కు 26 ఫిర్యాదులు వచ్చాయి.

అమృత్-2పై వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం

» బందరు ఎంపీ బాలశౌరి ఎద్దేవా



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి, చిత్రంలో బోడె ప్రసాద్ తదితరులు

పెనమలూరు, ఏప్రిల్ 3 : పట్టణాల్లో డ్రైయిన్లు, మంచినీరు, రోడ్లు లాంటి మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్-2 పథకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవడంలో విఫలమైందని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. బుధవారం కానూరు మన గార్డెన్స్ సమీపంలోని ఇంద్ర ఐకాన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి స్థానికులతో మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్-2 పథకానికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా నలభై శాతం చెల్లించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని పేర్కొన్నారు. విజయవాడ, తాడిగడప ప్రాంతాలకు కృష్ణా, గోదావరి జలాలను తెచ్చి ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు బోడె ప్రసాద్‌తో కలిసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బోడె ప్రసాద్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

వృద్ధురాలి మృతికి అధికారులే కారణం..



గంగూరు (కంకిపాడు) : పింఛన్ల పంపిణీలో అధికారుల బాధ్యతారాహిత్యంపై వల్లభనేని బాలశౌరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగూరులో పింఛన్ కోసం వెళ్లి మృతి చెందిన వజ్రమ్మ మృతదేహాన్ని బుధవారం ఆయన సందర్శించి, కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, వృద్ధురాలి మృతికి అధికారులే కారణమన్నారు. ఎన్నికల నిబంధనలు ఉండగా పింఛన్ పంపిణీకి ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సచివాలయ, పంచాయతీ సిబ్బంది చేత సకాలంలో పింఛన్ పంపిణీ చేయలేకపోవడం సిగ్గుచేటన్నారు.

ఎండలో ఏడిపింఛెన్!

(5వ పేజీ తరువాయి)

ఈ రద్దీని ఎక్కువగా చూపించడానికి విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల్లో సాయంత్రం వరకు కూడా పింఛన్లు ఇవ్వలేదు. అదేమని అడిగితే.. బ్యాంకుల నుంచి ఇంకా డబ్బు రాలేదని సమాధానం చెప్పారు. దీంతో వృద్ధులు రెండు, మూడు గంటలకు పైగా అక్కడే పడిగాపులు పడాల్సి వచ్చింది. వృద్ధులు, దివ్యాంగుల



ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తారని చెప్పినా వైసీపీ నాయకులు వారిని ఆటోల్లో సచివాలయాల వద్దకు తీసుకొచ్చారు. కొందరు వృద్ధులు నడవలేని స్థితిలో, కళ్లు సక్రమంగా కనిపించకున్నా ఇబ్బందులు పడుతూ వచ్చారు. అవనిగడ్డ మండలంలో ఆటోల ద్వారా పింఛనుదారులను సచివాలయాలకు తీసుకొచ్చారు. ఎన్నికల ప్రచారం కోసం వైసీపీ నాయకులు వృద్ధులు, దివ్యాంగులను ఇలా వాడుకున్నారు.

చాలాచోట్ల వలంటీర్లు ప్రత్యక్షం

వలంటీర్లు పింఛన్ పంపిణీకి దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసినా పెద్దగా పట్టించుకోలేదు. వైసీపీ నాయకుల సూచనలతో వలంటీర్లు సచివాలయ వద్దే కనిపించారు. మచిలీపట్నంలోని 45వ డివిజన్‌లో పదిమందికి పైగా వలంటీర్లు పింఛనుదారులను ఆటోల్లో తీసుకొచ్చారు. కొంతమంది పింఛనుదారులకు వలంటీర్లు ఫోన్లు చేసి మరీ సచివాలయం వద్దకు పిలిపించారు. సచివాలయం వద్ద వలంటీర్లు ఉండగా, మీడియా వారు ఫొటోలు తీశారు. వైసీపీ 45వ డివిజన్ ఇన్‌చార్జి ఎ.శ్రీనివాస్ అక్కడకు వచ్చి.. వలంటీర్ల ఫొటోలు ఎవరు తీశారంటూ వీరంగం సృష్టించాడు. ఫొటోలు తీసిన వారిపై కేసు పెట్టాలంటూ పెద్దపెద్ద కేకలు వేశాడు. 45వ డివిజన్ కార్పొరేటర్ ఓ మహిళ కాగా, తానే డివిజన్‌కు ఇన్‌చార్జినంటూ ఈయన చేసే హంగామా అంతా ఇంతా కాదని అక్కడున్న పింఛనుదారులే గుసగుసలాడుకున్నారు. తాము తీసుకొచ్చిన పింఛనుదారులు బయటకు వచ్చే వరకు వలంటీర్లు అక్కడే వేచి ఉన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపించింది.



పర్నాసలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో వెనిగండ్ల, రావి తదితరులు

టీడీపీ హయాంలోనే అభివృద్ధి : వెనిగండ్ల

గుడివాడ రూరల్, ఏప్రిల్ 3 : పర్నాస గ్రామంలో గత 20 సంవత్సరాల్లో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి తప్ప కొడాలి నాని చేసింది ఏమీ లేదని గుడివాడ తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం వెనిగండ్ల రాము చినవానిగూడెం, పర్నాస గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ'పై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్నాసలో అభివృద్ధి మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, రావి హయాంలోనే జరిగిందని, కొడాలి నాని చేసిన అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి బూతులు తిట్టడమే అలవాటుగా మారిందని తెలిపారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గుడివాడ, ముదినేపల్లి (పాతది) నియోజకవర్గాలను తమ కుటుంబం చాలా అభివృద్ధి చేసిందన్నారు. తాను మంత్రిగా చేసిన పనులు ఇప్పుడు కనపడుతున్నాయని తెలిపారు. వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కొడాలి నాని గుడివాడకు చేసిన అభివృద్ధి రోడ్లపై అడుగడుగునా కనిపించే గుంతలే సమాధానమిస్తాయన్నారు. కార్యక్రమంలో గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య (బాబ్జీ), మండల అధ్యక్షులు వాసే మురళీ తదితరులు పాల్గొన్నారు.

వేధించి.. బెదిరించి.. కటకటాల వెనక్కు!

» ప్రేమ పేరుతో యువతికి వేధింపులు!

» పోలీసులను ఆశ్రయించిన తండ్రి

» షాపులో గంజాయి పెట్టి బెదిరింపులు

» ఇద్దరు యువకులపై కేసు నమోదు

గుడివాడ, ఏప్రిల్ 3 : ఇద్దరు యువకులు యువతిని వేధిస్తుండటంతో విసిగివేశారిన తండ్రి పోలీసులు ఆశ్రయించాడు. దీంతో కోపోద్రిక్తులైన యువకులు సదరు తండ్రి దుకాణంలో గంజాయిని డంపింగ్ చేసి బెదిరింపులకు పాల్పడి, కటకటాల పాలైన సంఘటన గుడివాడలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పెద్దవీధికి చెందిన వ్యక్తికి రైతు బజారు సమీపంలో ఫ్యాన్సీ దుకాణం ఉంది.

అతడి కుమార్తెను కొంతకాలంగా ధనాల ప్రవీణ్, శశిలు వేధిస్తున్నారు. ఈ క్రమంలో తండ్రి ఒన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల కాలయాపనతో వేధింపులు మరింత పెరిగాయి. ఫిర్యాదు చేసిన విషయం తెలుసుకున్న ఇద్దరు యువకులు కోపోద్రిక్తులై పథకం ప్రకారం తండ్రి ఫ్యాన్సీ దుకాణంలో గంజాయి డంప్ చేశారు. అది వీడియో తీసి బ్లాక్‌మెయిల్‌కు దిగారు. విషయాన్ని ఇంతటితో వదిలేయాలంటే తమకు రూ.2లక్షలు ఇవ్వాలని, లేకుంటే పోలీసులకు రూ.5లక్షలు యిచ్చుకోవాల్సి వస్తుందని బెదిరించడంతో సమీప దుకాణదారులు, స్థానికులు యువకులను నిలదీశారు. దీంతో యువకులు తమపై దుకాణదారుడు దౌర్జన్యం చేస్తున్నాడని, దుకాణంలో గంజాయి అమ్మకాలు చేస్తున్నట్టు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 10నిమిషాల్లోనే టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి దుకాణదారుడిని స్టేషన్‌కు తరలించారు.


తన కుమార్తెను వేధిస్తున్నారని ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించని పోలీసులు.. ఇంత త్వరగా రావడం పట్ల దుకాణదారుడు ఆశ్చర్యపోయాడు. స్థానికులు పెద్దఎత్తున స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగడంతో ఎట్టకేలకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా యువకులే గంజాయిని డంప్ చేశారని టూటౌన్ పోలీసులు నిర్ధారించారు. యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ దుర్గారావు తెలిపారు. దీంతో గంజాయి వారికి ఎక్కడి నుంచి వచ్చింది.. అమ్మకాలు చేస్తున్నదెవరో తేల్చేందుకు ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టినట్టు సమాచారం.

రైతుల సొమ్ముతో పీఏసీఎస్ కార్యదర్శి పరార్!

» రూ.30 లక్షలు కేడీసీసీలో జమ చేయని వైనం

» ఆందోళన చెందొద్దు : బ్యాంకు మేనేజర్

రెడ్డిగూడెం, ఏప్రిల్ 3 : ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురం పీఏసీఎస్ కార్యదర్శి వి.ప్రభుదాస్ రైతుల సొమ్ము రూ.30 లక్షలతో పరారైనట్టు తెలుస్తోంది. పీఏసీఎస్ నుంచి పొందిన పలు రకాల రుణాల తాలూకా బకాయిలను ఫైనాన్సియల్ ఇయర్ క్లోజింగ్ కావడంతో పీఏసీఎస్‌లో సుమారు రూ.30 లక్షలు జమ చేశారు. ఆమొత్తాన్ని విస్సన్నపేట కేడీసీసీ బ్యాంకులో కార్యదర్శి మార్చి 31లోగా జమచేయాల్సి ఉండగా ఏప్రిల్ 3 తేదీ వరకు జమ చేయలేదు. దీంతో బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీప్రసాద్, సూపర్‌వైజర్ నాగేశ్వరరావులు కార్యదర్శి ప్రభుదాసుకు ఫోన్‌చేశారు. ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో కార్యదర్శి సొంత గ్రామమైన కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం కొమ్మలపూడిలోని నివాసంలో విచారణ చేయించారు. అక్కడ ఇంటికి సైతం తాళాలు వేసి ఉండటంతో కార్యదర్శి పరారైనట్టు గ్రహించి బుధవారం మేనేజర్, సూపర్‌వైజర్‌లు శ్రీరాంపురం పీఏసీఎస్‌కు వచ్చి రికార్డులు పరిశీలించగా రైతుల నుంచి సుమారు రూ.30 లక్షలు రికవరీ చేసినట్టు గుర్తించారు. ఇంకా రికార్డులు పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతుల సొమ్మును అతడి నుంచి వసూలు చేస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు తెలిపారు. సొసైటీల్లో వరుస స్వాహాపర్వాలతో మండల రైతుల్లో ఆందోళనలు నెలకొంటున్నాయి. ఇప్పటికే మండలంలో రెండు సొసైటీల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సొసైటీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

ఆర్టీసీ డ్రైవర్లు రహదారి నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ శివాజీ

గన్నవరం, ఏప్రిల్ 3 : ఆర్టీసీ డ్రైవర్‌లు రహదారి నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ వీపీ రాజు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌లకు రహదారి భద్రతపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వీపీ రాజు మాట్లాడుతూ, ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానానికి చేరే విధంగా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అతివేగం ప్రమాదకరమని వివరించారు. డిపో మేనేజర్ పి.శివాజీ మాట్లాడుతూ, డ్రైవర్‌లు ఆర్టీసీ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

కానుమోలు హైస్కూల్‌లో చోరీ

● రూ.లక్ష విలువైన రెండు ఐఎస్‌బీ ప్యానల్ బోర్డులు మాయం



చోరీ విషయమై విచారణ చేస్తున్న ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, ఎస్సై జనార్దన్‌తో హెచ్‌ఎం పద్మజ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 3 : కానుమోలు హైస్కూల్‌లో విద్యార్థులకు దృశ్యశ్రవణ విధానం ద్వారా బోధించేందుకు అవసరమైన విలువైన రెండు ఐఎస్‌బీ ప్యానల్ బోర్డులు చోరీకి గురయ్యాయి. కానుమోలు హైస్కూల్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి విలువైన వస్తువులు దొంగతనం చేసిన విషయమై హెచ్‌ఎం పద్మజ ఫిర్యాదు చేయగా బుధవారం ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, హనుమాన్‌జంక్షన్ ఎస్సై జనార్దన్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చిరివాడ వలంటీర్ తొలగింపు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 3 : అధికార పార్టీ నాయకులతో పార్టీ వ్యవహారాల్లో పాలుపంచుకుంటున్నట్లు ఫిర్యాదులు అందడంతో చిరివాడ గ్రామ వలంటీర్ తలారి ప్రశాంతిని విధుల నుంచి తొలగించినట్లు బుధవారం బాపులపాడు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. దీంతో పాటు రేమల్లెకు చెందిన పద్వీరాజ్, వేలేరుకు చెందిన చొదిమెల్ల సాల్మన్, బండారుగూడెంకు చెందిన దాసి అశోక్ రాజీనామా చేసినట్టు తెలిపారు.

సీఎస్ఐ చర్చిపై కోర్టు స్టేను నిరసిస్తూ శాంతి ర్యాలీ



శాంతిర్యాలీలో సంఘస్తులు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 3 : బాపులపాడులో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవంపై కోర్టు స్టే ఆర్డర్ జారీ చేయడంతో చర్చి సంఘ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. చర్చి బయట పందిళ్లు వేసి ప్రార్థనలు నిర్వహించారు. చర్చి నిర్మాణ బాధ్యతలు పర్యవేక్షించిన టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు చర్చిని ప్రారంభించకుండా తన అనుయాయులతో కోర్టు స్టే తీసుకు వచ్చారంటూ ఆరోపిస్తూ సంఘ సభ్యులు రాజేశ్వరరావుకు వ్యతిరేకంగా నినదిస్తూ ర్యాలీ చేశారు.

రాజకీయ కుట్ర : రాజేశ్వరరావు

సీఎస్ఐ చర్చి నిర్మాణంలో కేవలం పర్యవేక్షణ పాత్ర వహించిన తనపై రాజకీయ దురుద్దేశంతో, టీడీపీ యూత్ లీడర్‌గా ఉన్న నా కుమారుడు రాజీవ్‌కాంత్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ బురద జల్లుతున్నారని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తాను చర్చి నిర్మాణ బాధ్యతలు తీసుకొని ప్రజల నుంచి విరాళాలు సేకరించి దాదాపు నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో తనకు ఖ్యాతి వస్తుందన్న దుగ్ధతో ఆర్థిక అవకతవలకు పాల్పడినట్లు ఆరోపించడం అన్యాయమన్నారు.

కూటమితోనే రాష్ట్రానికి భవిష్యత్తు

గన్నవరం కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు



ఉంగుటూరులో మూడు పార్టీల ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న యార్లగడ్డ

ఉంగుటూరు, ఏప్రిల్ 3 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో ఏర్పడే సంకీర్ణ ప్రభుత్వంలోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు వుంటుందని గ్రహించి అనేకమంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతున్నారని గన్నవరం నియోజకవర్గ మూడు పార్టీల కూటమి ఉమ్మడి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఉంగుటూరులో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు యార్లగడ్డ సమక్షంలో టీడీపీలో చేరారు. పొట్టిపాడుశివారు ఆనందపురానికి చెందిన వైసీపీ నాయకులు కాకి జయంతిబాబు, తురక షడ్రక్ శేషగిరిరావు (చంటి), లంకపల్లికి చెందిన పి. గాబ్రియేలు, వేములకొండ బాబు, వేమినీడు వెంకటేశ్వరరావు, జె.పుల్లయ్య, ఉంగుటూరుకు చెందిన ఈడ్పుగంటి కృష్ణమూర్తి, మరో 35 కుటుంబాలకు చెందిన నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. యార్లగడ్డ వెంకట్రావు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, మండవ రమ్య, బచ్చుల బోసు, కొండేటి కొండలు, కొండేటి వెంకటేశ్వరరావు, మండల పరిధిలోని అన్నిగ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోల్ మేనేజ్‌మెంట్ పక్కాగా వుండాలి

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు విజయం సాధించాలంటే పోల్ మేనేజ్‌మెంట్ పక్కాగా వుండాలని గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఉంగుటూరులో టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బూత్‌లెవెల్ ఏజెంట్లతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టతపై గ్రామాల వారీగా పార్టీశ్రేణులతో సమీక్ష జరిపారు. మూడుపార్టీల నాయకులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తూ భారీ మెజార్టీ సాధించేలా కృషిచేయాలని, ఏమైనా ఇబ్బందులు వుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మూడు పార్టీల సానుభూతిపరులు, నాయకులు, కార్యకర్తలు అందరూ ఓటింగ్‌లో పాల్గొనేలా కృషిచేయాలన్న ఆయన ఎన్నికల్లో దొంగ ఓట్లు పడకుండా అడ్డుకోవాలన్నారు. ముందుగానే ఓటరు లిస్టులు పరిశీలించి ఓటర్లపై అవగాహనకు రావాలని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో గన్నవరం నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్న ఆయన తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సూపర్ సిక్స్ పథకాలతోపాటు గన్నవరం భవిష్యత్తును మారుస్తానని భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ పాలన తీరుపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో వున్నారని, ప్రభుత్వ వ్యతిరేక ఓటును టీడీపీకి అనుకూల ఓటుగా మలచి ఓటింగ్ చేయించాల్సిన బాధ్యత పార్టీశ్రేణులపై వుందని పేర్కొన్నారు.

చంద్రబాబుపై బురదజల్లడానికే కుట్ర

పెనమలూరు ఉమ్మడి అభ్యర్థి బోడె ప్రసాద్



మంచినేని పరమేష్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్ 3 : లక్షన్నర మంది సచివాలయ ఉద్యోగులను చేతిలో పెట్టుకొని రాష్ట్రంలో పెన్షన్లు పంచలేక ఆ నెపాన్ని చంద్రబాబుపైకి నెట్టి టీడీపీపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం జగన్‌రెడ్డికే చెల్లిందని పెనమలూరు ఉమ్మడి అభ్యర్థి బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఆరవ క్లస్టరు సమీక్ష అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వృద్ధులను, పేదలను, దివ్యాంగులను ఎండలో కావాలనే నిలబెట్టి చంద్రబాబు వల్లే ఇలా జరుగుతోందని ప్రచారం చేయడం పూర్తి దిగజారుడుతనానికి పరాకాష్ట అని విమర్శించారు. పెన్షన్ల లబ్దిదారులకు ఒకటో తేదీనే సొమ్ము ఇచ్చే అవకాశం ఉన్నా.. మార్చి నెలాఖరుకు సొంత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ పెన్షను డబ్బులు ఆపి జగన్‌రెడ్డి ఈ దుర్మార్గాలు చేస్తున్నాడని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ వాలంటీర్ల ముసుగులో ఉన్న వైసీపీ కార్యకర్తలను నియంత్రించేందుకు రెండు నెలల పాటు ప్రభుత్వ విధులకు దూరం పెడితే ఆనెపాన్ని ఈ చేతగాని ప్రభుత్వం చంద్రబాబుపైకి నెట్టడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లస్టరు ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావు, వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకరరావు, షేక్ బుజ్జి, కోయ ఆనంద్‌ప్రసాద్, అంగిరేకుల మురళి, కాసరనేని మురళి, శొంఠి శివరాంప్రసాద్, వీరంకి కుటుంబరావు, పీతా గోపీచంద్, తాడిశెట్టి వీరాస్వామి, బలగం నాగరాజు, అరుణ్‌బాబు, మాబు సుభాని పాల్గొన్నారు.

మంచినేని పరమేష్ టీడీపీలో చేరిక

సీనియర్ నాయకులు మంచినేని పరమేష్ టీడీపీలో చేరికతో పార్టీ మరింత బలపడుతుందని బోడె ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో మంచినేని పరమేష్, బండెల రవి తదితరుల పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సైకో పాలన, విధానాలతో విసుగు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు మొగ్గు చూపుతారన్నారు.

సీపీఎం విజయానికి కృషి చేయాలి



బాపులపాడు సీపీఎం కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహారావు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 3 : వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజానీకం ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. బుధవారం గన్నవరం నియోజకవర్గం సీపీఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు బాపులపాడు మండలంలో గురువారం నుంచి నిర్వహించనున్న ఎన్నికల ప్రచారంపై స్థానిక సీపీఎం కార్యాలయలంలో ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమీక్ష సమావేశం జరిగింది. మండలంలో నిర్వహించనున్న ప్రచార కార్యక్రమంపై జోన్ కమిటీ సభ్యులు నిర్వహించాల్సిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. సీపీఎం అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. వైసీపీ దుర్మార్గపు పాలనపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బేత శ్రీనివాసరావు, జిల్లా రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ, తోట సాంబశివరావు, అబ్దుల్‌బారి, తాళం మధు, మారేశ్వరరావు, బాలరాజు, బర్రె లెనిన్, రాజనాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ కళాశాల వార్షికోత్సవం

ఎనికేపాడు(గన్నవరం), ఏప్రిల్ 3 : ఎనికేపాడు ఎస్‌ఆర్‌కే ఫౌండేషన్ విజయ మహిళ ఫార్మసీ కళాశాల 15వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ, ఫార్మసీ రంగానికి మంచి భవిష్యత్ ఉందన్నారు. ఫార్మసిస్టుల కొరత విపరీతంగా ఉందన్నారు. మహిళలు ఔషధ రంగంలో రాణించటం వల్ల వారి కుటుంబం ఉన్నతంగా ఉంటుందన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మస్యూటికల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రమీళరాణి మాట్లాడుతూ, ఫార్మసి పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలత తది తరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో బయటపడ్డ ప్రభుత్వ అసమర్థత



కానూరులో జరిగిన కార్యక్రమంలో వెలగపూడి తదితరులు

పెనమలూరు, ఏప్రిల్ 3 : లక్షన్నర మంది సచివాలయ సిబ్బంది ఉండి ఒక్క రోజులో పెన్షన్లను పంపిణీ చేయలేక చేతులెత్తేసిన అసమర్థ ప్రభుత్వం జగన్‌రెడ్డి ప్రభుత్వమని టీడీపీ నాయకులు వెలగపూడి శంకరబాబు, షేక్ బుజ్జి, మొక్కపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కానూరు, యనమలకుదురుల్లో జరిగిన శంఖారావం కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. తమ కాంట్రాక్టర్లకు దోచిపెట్టుకునేందుకు నిధులను మళ్లించి పెన్షన్లు ఆలస్యం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. గంగూరులో పింఛనకు వచ్చిన వృద్ధురాలు ఎండకు తాళలేక మృతి చెందడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. చంద్రబాబుపై పెన్షన్ల గురించి బురద జల్లడం దారుణమని పేర్కొన్నారు. టీడీపీ జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. సుబ్రహ్మణ్యం, బలగం కొండ, కోసూరి రమేష్, లంకా వెంకటేశ్వరరావు, చలసాని రాము పాల్గొన్నారు.

అరకొరగా పింఛన్ల పంపిణీ

ఉయ్యూరు, ఏప్రిల్ 3 : ఉయ్యూరు నగర పంచాయతీ, మండల పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం ప్రారంభించారు. నగర పంచాయతీ పరిధిలో 3,994 మందికి పింఛను పంపిణీ చేయవలసి ఉండగా, 10 వార్డు సచివాలయాల్లో పంపిణీ ప్రారంభించారు. మండల పరిధిలో పదకొండు గ్రామాలకు గాను పెదఓగిరాల, ఆకునూరు రెండు గ్రామాల్లో మాత్రమే పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. **హనుమాన్‌జంక్షన్** : బాపులపాడు మండలంలో పింఛన్లు పంపిణీ కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం నుంచి సచివాలయ సిబ్బంది ప్రారంభించారు. మండలంలో 12,053 మందికిగాను 5,457 మందికి మొదటి రోజు అన్ని సచివాలయల్లో లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు.

గ్రామీణాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 3 : గ్రామీణాభివృద్ధితో పాటు సూపర్‌సిక్స్ పథకాల ద్వారా సకాలంలో సంక్షేమ పథకాలు అందిం చడం టీడీపీతోనే సాధ్యమని తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలు దోనవల్లి నాగశిరోమణి అన్నారు. రంగన్నగూడెం, సింగన్నగూడెంలో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తూ గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ప్రకటించిన కార్యాచరణ గురించి ప్రజలకు వివరించారు. వైసీపీ పాలనలో కుంటుపడిన గ్రామీణాభివృద్ధి గాడిలో పడాలంటే బందరు పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని, గన్నవరం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, మొవ్వా వేణుగోపాల్, ఆళ్ల గోపాలకృష్ణ, బీజేపీ నాయకుడు కసుకుర్తి వెంకట శాస్త్రులు, వెంకటేశ్వరచౌదరి, మందపాటి రాంబాబు, తలారి ఏసుపాదం పాల్గొన్నారు.



ఆకునూరులో జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

బీసీల సమగ్రాభివృద్ధికే డిక్లరేషన్

జయహో బీసీ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ

ఆకునూరు(ఉయ్యూరు), ఏప్రిల్ 3 : వెనుకబడిన వర్గాల అభివృద్ధి, అభ్యున్నతికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ బీసీ డిక్లరేషన్ ప్రకటించారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆకునూరు గ్రామ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని బడుగు బలహీన వర్గాలకు జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసిన ద్రోహాన్ని వివరించారు. చంద్రబాబు అధికారంలో ఉండగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు గుర్తుచేశారు. నిత్యావసరాల ధరలు, విద్యుత్, బస్సు చార్జీలు పెంచి వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై పెనుభారం మోపిందన్నారు టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్, వెలగపూడి వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కొండా ప్రవీణ్, బీసీ సెల్ కార్యదర్శి పి గోపీచంద్, బీసీ నాయకులు జంపన శ్రీనివాస్, ఓగిరాల నాగ భూషణం, రామకృష్ణ, కొలుసు పోతురాజు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

గంగూరులో వృద్ధురాలి మృతి

వైసీపీ ప్రభుత్వ హత్యే: రాజా

కంకిపాడు, ఏప్రిల్ 3 : హత్యారాజకీయాలు జగన్‌రెడ్డికి ఆనవాయితీగా మారాయి అని మాజీ ఎంపీపీ దేవినేని రాజా మండిపడ్డారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్‌కు ఎన్నికల సమయంలో హత్యలు చేయించటం పరిపాటిగా మారిందన్నారు. 2014 ఎన్నికల్లో తండ్రి రాజశేఖరెడ్డి మృతిని అడ్డుపెట్టుకొని ఎన్నికల్లోకి వెళ్లారని, 2019 సొంత బాబాయిని హత్య చేసి ఎన్నికల్లోకి వెళ్లి గెలుపొందారన్నారు. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో కావాలనే పింఛన్ పంపిణీలో తాత్సారం చేస్తూ పండుటాకుల హత్యకు కారణమవుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతటి దుర్మార్గపు ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. జగన్‌కు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

రక్తహీన రహిత జిల్లాగా కృష్ణాను తీర్చిదిద్దుతాం: డీఎంహెచ్‌వో

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3: రక్తహీన రహిత జిల్లాగా కృష్ణాజిల్లాను తీర్చిదిద్దుతామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) గీతాబాయి అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, నర్సులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మాతృ, శిశు మరణాలు, గర్భవతుల పర్యవేక్షణపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఆయుష్మాన్ భారత్, డిజిటల్ మిషన్ కార్యక్రమాలపై చర్చించారు. కౌమారదశ పిల్లల్లో రక్తహీనతకు మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సీతాకుమారి, జిల్లా మలేరియా అధికారి రామారావు, ఫ్యామిలీ డాక్టర్ నోడల్ అధికారిణి విజయభారతి, వైద్యాధికారి నాగభవాని తదితరులు పాల్గొన్నారు.



పులిగడ్డ, మచిలీపట్నం 36వ సచివాలయం, మొవ్వ మండలం చినముత్తేవిలో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

పింఛన్ల కోసం పడిగాపులు

- సచివాలయాలకు సాయంత్రం చేరిన నగదు
- సరైన ప్రచారం లేక ఉదయమే వచ్చి ఎండలకు అల్లాడిన వృద్ధులు, దివ్యాంగులు

అవనిగడ్డ, ఏప్రిల్ 3: ఖజానాలో చాలినంత నిధులు లేకపోవటంతో బుధవారం సాయంత్రానికి గానీ సచివాలయాలకు పింఛన్ల పంపిణీకి నిధులు విడుదల కాలేదు. మండలవ్యాప్తంగా 6,099 మందికి రూ.1.85 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, సచివాలయాల వారీగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

లబ్ధిదారులకు ఇక్కట్లు

సచివాలయాల భవనాలు లేని ఎడ్లంక, మోదుమూడి, తుంగలవారిపాలెం గ్రామాల ప్రజలు రెండు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న క్లస్టర్ సచివాలయాలకు వెళ్లి పడిగాపులు పడాల్సి వచ్చింది. నాలుగు కిలోమీటర్ల అవతల ఉండే పులిగడ్డలోని సచివాలయానికి రావడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఉదయమే వచ్చి పడిగాపులు పడుతున్నామని పులిగడ్డ క్లస్టర్ కిందకు పాత ఎడ్లంక పింఛన్‌దారులు వాపోయారు. సాయంత్రం 4 గంటల వరకు పింఛన్ డబ్బు పులిగడ్డ సచివాలయం వద్దకు చేరకపోవటంతో లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు వేయించుకుని నగదు వచ్చిన వెంటనే పంపిణీ పూర్తి చేశారు. కొన్ని గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి పంపిణీ చేస్తామని మైకులు పెట్టి ప్రచారం చేశారు.

అవనిగడ్డ సచివాలయం వద్ద టీడీపీ మజ్జిగ పంపిణీ

తీవ్రమైన వడగాల్పుల కారణంగా లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు గమనించి టీడీపీ నేతలు బుధవారం సాయంత్రం అవనిగడ్డ సచివాలయం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేసే అవకాశమున్నా ప్రభుత్వం విపక్షాలపై నెపం నెట్టాలనే లబ్ధిదారులను సచివాలయాల దగ్గరకు రప్పిస్తుందని, ఇది నైతికతకాదని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.

మొవ్వ మండలంలో సగం పంచాయతీల్లోనే..

కూచిపూడి: మొవ్వ మండలంలో 21 పంచాయతీలు ఉంటే పది పంచాయతీల్లోనే బుధవారం సాయంత్రం ఐదున్నర గంటలకు పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పంపిణీ సమయం చెప్పకపోవడంతో ఉదయం నుంచి మండుటెండల్లో సచివాలయాల చుట్టూ వృద్ధులు, దివ్యాంగులు వితంతువులు అనేక పర్యాయాలు తిరగాల్సి వచ్చింది. పింఛన్లు పంపిణీ చేసే చోట టెంట్లు వేయకపోవడం, మంచినీటి సౌకర్యం కల్పించకపోవటంతో వృద్ధులు అవస్థలు పడ్డారు. సచివాలయానికి వచ్చిన వారందరికీ పింఛన్లు అందజేసి మిగిలిన వారికి ఇంటి వద్ద అందిస్తామని ఎండీవో చంద్రశేఖరరావు తెలిపారు.

నగదు రాక పంపిణీ వాయిదా

పెదపారుపూడి: సమయానికి డబ్బులు రాకపోవటంతో మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేయలేదు. దీంతో గ్రామసచివాలయాల వద్దకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు బుధవారం నిరాశతో తిరిగి వెళ్లిపోయారు. సచివాలయాల వద్ద తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవటంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందిపడ్డారు.

శారదాయిపేట బుక్‌కీపర్ అసత్య ప్రచారం

- పింఛన్ల పంపిణీలో జాప్యానికి ప్రతిపక్షాలే కారణమని వాట్సాప్‌లో పోస్టులు
- చర్యలకు టీడీపీ, జనసేన డిమాండ్

పెడన: వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు ఇవ్వకపోవడానికి ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడమే కారణమని గూడూరు మండలం శాదరాయిపేట గ్రామానికి చెందిన బుక్ కీపరు వీరవల్లి భారతి..వీవో వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసి ప్రచారం చేస్తోందని ఏపీఎంకు టీడీపీ, జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. భారతిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పోతన స్వామి, దాసరి ఉమాసాయిరామ్, కోలపల్లి రజని, బొర్రా శ్రీనివాసరావు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

80 శాతమే బ్యాంకులో జమ

గుడివాడ రూరల్: మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీని సచివాలయాల వద్ద ప్రారంభించారు. ఎండ వేడిమికి తాళలేక మధ్యాహ్నం పింఛన్లు ఇస్తామని చెప్పినప్పటికీ ఉదయానికే సచివాలయాల వద్దకు వచ్చి పింఛన్‌దారులు కూర్చున్నారు. పింఛన్ల నగదు బుధవారం 80 శాతమే జమైందని మిగిలినవి గురువారం తీసుకెళ్లమని బ్యాంక్ అధికారులు చెప్పారని కార్యదర్శులు తెలిపారు.

ఆలస్యంగా పంపిణీ

ఘంటసాల: మండలంలోని 13 సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. బ్యాంకుల్లో నగదు జమ ఆలస్యం కావటంతో మధ్యాహ్నం 2 గంటలకు నగదు తీసుకుని వచ్చి పింఛన్‌దారులకు పంపిణీ చేశారు. కొన్ని గ్రామాల్లో లబ్ధిదారులు ఉదయమే సచివాలయాల వద్దకు చేరుకుని పడిగాపులు పడ్డారు. పంచాయతీ అధికారులు మధ్యాహ్నం నుంచి ఇస్తామని తెలియజేయటంతో ఆపసోపాలు పడి మళ్లీ మధ్యాహ్నం పింఛన్ కోసం రావాల్సి వచ్చింది. కొన్ని పంచాయతీల్లో కొంత నగదు తక్కువగా వచ్చిందని, గురువారం మిగిలిన వారికి ఇస్తామని పంచాయతీ కార్యదర్శులు చెప్పారని లబ్ధిదారులు తెలిపారు. ఎండీవో మారుతి శేషమాంబ సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీని పర్యవేక్షించి సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

నామమాత్రంగానే పంపిణీ

పామర్రు: ఉదయం సచివాలయాల వద్దకు పింఛన్ల కోసం వచ్చిన పింఛన్‌దారులకు బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని సిబ్బంది చెప్పడంతో ఎండలోనే లబ్ధిదారులు తిరిగి వెళ్లిపోయారు. బ్యాంకుల్లో ప్రభుత్వం నుంచి పూర్తి నగదు జమ కాకపోవడంతో అరకొరగా వచ్చిన నగదును సచివాలయ సిబ్బంది మొదటి రోజు నామమాత్రంగా పంపిణీ చేశారు.



పెదప్రోలులో పింఛన్ కోసం బారులు తీరిన లబ్ధిదారులు

పింఛన్లపై రాజకీయం సిగ్గుచేటు: సీపీఎం

గుడివాడ: పింఛన్ల పంపిణీపై అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేయడం సిగ్గుచేటని సీపీఎం కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి అన్నారు. బుధవారం కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ అధికారులు, వీఆర్వోలు సచివా లయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులందరూ కలిసి ఒక్కరోజులో సచివా లయ పరిధిలో ఫించన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని కల కోడ్ ముగిసే వరకు ఒకటో తేదీన ఫించన్‌ను పంపిణీ చేయాలన్నారు. ఐద్వా కార్యదర్శి పి.రజిని పాల్గొన్నారు.

జగన్ కుట్రతోనే పింఛన్‌దారులకు ఇబ్బందులు: కుమార్‌రాజా



పింఛన్ల పంపిణీలో ఆలస్యానికి కారణమేంటని పసుమర్రు సచివాలయ సిబ్బందిని అడుగుతున్న వర్ల కుమార్‌రాజా

పామర్రు: పింఛన్ల పంపిణీపై జగన్మోహన్ రెడ్డి చేసిన కుట్రతోనే పింఛన్‌దారులు ఇబ్బంది పడుతున్నారని టీడీపీ-జనసేన-బీజేపీ పామర్రు అభ్యర్థి వర్ల కుమార్ రాజా అన్నారు. పసుమర్రు గ్రామ సచివాలయం వద్ద బుధవారం పింఛన్ల పంపిణీ జరగక పింఛన్ దారుల పడిగాపులు పడుతుండడంతో ఎందుకు పింఛన్ల పంపిణీ ఆలస్యమైందని గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బందిని ఆయన ప్రశ్నించారు. సాయంత్రం నాలుగు గంటలైనా సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీ చేయకపోవడంపై ఎందుకు పింఛన్‌దారులను పడిగాపులు కాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

మచిలీపట్నంలో 37 శాతం పంపిణీ

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం నగరంలో సాయంత్రం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. వృద్ధులు, దివ్యాంగులు ఉదయం నుంచే పింఛన్ల కోసం పడిగాపులు పడ్డారు. అయితే బ్యాంకుల వద్దకు వెళ్లి సచివాలయ అడ్మిన్లు నగదు తీసుకురావడంలో జాప్యం ఏర్పడింది. సాయంత్రం 4 గంటల నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. నగరంలో 50 డివిజన్లలో 19,136 మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల్లో 7070 మందికి మొదటి రోజు బుధవారం పింఛన్లు అందజేశారు. 37 శాతం పంపిణీ చేశారు. కమిషనర్ బాపిరాజు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. బందరు రూరల్ మండలంలో 12,196 మందికి గానూ 6072 పింఛన్లు అందించారు. 49 శాతం పంపిణీ జరిగింది.

రాజీనామా చేసిన వలంటీర్లు భాగస్వామ్యం

సచివాలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు ఇచ్చే కార్యక్రమాన్ని వైసీపీ కార్పొరేటర్లు, రాజీనామా చేసిన వలంటీర్లు పర్యవేక్షించారు. కొన్ని వార్డుల్లో దివ్యాంగులు, వృద్ధులను సచివాలయాలకు ఆటోలపై వలంటీర్లు తీసుకుని వచ్చారు.

50 శాతం పంపిణీ

గుడ్లవల్లేరు: మండలంలో బుధవారం సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 7279 మందికి గానూ 3582 మందికి(50శాతం)పంపిణీ చేశామని ఎండీవో కార్యాలయం సీఏ బలరామ్ వెల్లడించారు. గురువారం ఉదయం 7.30గంటల నుంచే పంపిణీ ప్రారంభిస్తామని గుడ్లవల్లేరు పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు.

చల్లపల్లిలో 53 శాతం..

చల్లపల్లి: చల్లపల్లిలో ఫించన్ల పంపిణీ మధ్యాహ్నం నుంచీ ప్రారంభమైంది. తొలిరోజు నాలుగు సచివాలయాల్లో రాత్రి ఏడు గంటల వరకు ఫించన్లు అందచేశారు. చల్లపల్లిలో 2126 ఫించన్లకు తొలిరోజే 1130 (53శాతం) ఫించన్లు పంపిణీ చేశారు.

6వ తేదీ వరకు పంపిణీ

మోపిదేవి: మండలంలోని గ్రామ సచివాలయాల వద్ద మధ్యాహ్నం పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. మోపిదేవి, పెదప్రోలు, వెంకటాపురం, పెదకళ్లేపల్లి గ్రామసచివాలయాల వద్ద ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు. మండలానికి రూ.కోటి 15 లక్షలు నగదు రావాల్సి ఉండగా, రూ.కోటి 12 లక్షలను అధికారులు బ్యాంకు నుంచి తెచ్చారు. 6వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

బ్యాంకుల నుంచి మధ్యాహ్నం అందిన నగదు

తోట్లవల్లూరు: మండలంలో బ్యాంకుల నుంచి పింఛన్ డబ్బులు బుధవారం మధ్యాహ్నం సచివాలయ సిబ్బందికి అందడంతో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. మండలంలో 6,825 మందికి రూ.19,79,000 వచ్చాయని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు.

రోల్డుగోల్డు పరిశ్రమను అభివృద్ధి చేస్తాం

- కొల్లు రవీంద్ర హామీ



జ్యూయలరీ పార్కులో కార్మికులతో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 3: టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వమొచ్చాక బందరులో రోల్డుగోల్డు పరిశ్రమను అభివృద్ధి చేస్తామని, రోల్డుగోల్డు నగలకు అంతర్జాతీయంగా మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని కూటమి మచిలీపట్నం నియోజకవర్గ అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బందరు మండలం పోతేపల్లి జ్యూయలరీ పార్కులో బుధవారం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావుతో కలిసి ఆయన పర్యటించారు. రోల్డుగోల్డు యూనిట్ల యజమానులతో, కార్మికులతో మాట్లాడారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోల్డుగోల్డు కార్మికులతో కలిసి కాసేపు పనిచేశారు. మహిళల స్వయం ఉపాధికి రోల్డుగోల్డు పరిశ్రమ ఎంతో దోహదపడుతోందన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో అప్పటి కేంద్రమంత్రి చిరంజీవితో మాట్లాడి జ్యూయలరీ పార్కు అభివృద్ధికి రూ.5 కోట్లు తెచ్చానన్నారు. ఇందులో మహిళల కోసం స్వశక్తి భవన నిర్మాణానికి రూ.2.5 కోట్లు వ్యయం చేశామన్నారు. మిగిలిన పనులు తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను కొల్లు రవీంద్ర వివరించారు. బందరు రోల్డుగోల్డు నగలకు దేశ విదేశాల్లో మంచి పేరు ఉందన్నారు. కార్మికుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. టీడీపీ నాయకులు చిన్నం శివ, కాటం మధు, అక్కుమహంతి రాజా, కమ్మిలి మధు, బాజానీ, ఆరిఫ్, మరకాని వాసు, జనసేన నాయకులు మాదివాడ రాము, కొరియర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన జగన్‌రెడ్డి: కొల్లు రవీంద్ర



సుల్తానగరంలో కండువాలు కప్పి వైసీపీ కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్: బీసీలను సీఎం జగన్‌రెడ్డి మోసం చేశారని, రానున్న ఎన్నికల్లో వైసీపీ అడ్రస్ లేకుండా పోతుందని కూటమి మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం సుల్తానగరంలో బుధవారం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి ఆయన జయహో బీసీ కార్యక్రమాన్ని సుల్తానగరంలో నిర్వహించారు. పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. చంద్రబాబు హయాంలో బీసీ కార్పొరేషన్ ద్వారా పేదలకు సబ్సిడీపై రుణాలు ఇచ్చేవారని, విదేశీ విద్య చదివే బీసీ విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేవారని, కానీ, వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను రద్దు చేశారని రవీంద్ర అన్నారు. బీసీలు రానున్న ఎన్నికల్లో సత్తా చూపాలని కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి జనసేనలో చేరడంతో నియోజకవర్గంలో వైసీపీ నాయకులకు దడ పుడుతోందని బండి రామకృష్ణ అన్నారు. కాగిత వెంకటేశ్వరరావు, లంకె శేషగిరి, కుంచే నాని, గోకుల శివ, లంకె నారాయణ ప్రసాద్, కాగిత గోపాలరావు, గడ్డం రాజు, కొరియర్ శ్రీను పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీల్లో సభ్యుల చేరికకు ప్రత్యేక జీవో తెస్తాం: కొల్లు రవీంద్ర

గుడివాడ: మత్స్యకార సొసైటీల్లో సభ్యులను చేర్చుకునేలా కూటమి ప్రభుత్వంలో ప్రత్యేక జీవో తెస్తామని టీడీపీ-జనసేన-బీజేపీ మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ కాలనీలో ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ముఖ్య అతిథిగా కొల్లు విచ్చేశారు. ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన గుడివాడను పేకాట క్లబ్బులు, క్యాసినోలతో గుట్కా నాని అల్లరిపాలు చేశాడన్నారు. గుడివాడ గౌరవాన్ని కాపాడాలంటే వెనిగండ్ల రామును గెలిపించాలన్నారు. నియోజకవర్గంలోని పంచాయతీ చెరువులను సొసైటీకి వచ్చేలా చర్యలు తీసుకుంటానని టీడీపీ గుడివాడ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రోధి నామ సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

మచిలీపట్నం టౌన్: క్రోధి నామ నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. బుధవారం విశ్వహిందూ పరిషత్ భజరంగదళ్ నాయకులు కొల్లు రవీంద్ర చేతుల మీదుగా క్రోధి నామ సంవత్సర నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు కులవర్తి శ్రీనివాస్, కాంతారావు, రాజశేఖర్, ప్రసన్నాంజనేయులు, భజరంగదళ్ నాయకులు శ్రీరామశర్మ, బ్రాహ్మణ సంఘ నాయకుడు పి.వి.పణికుమార్ పాల్గొన్నారు.

ముస్లింలకు టీడీపీ ఇఫ్తార్ విందు

తోట్లవల్లూరు, ఏప్రిల్ 3: తోట్లవల్లూరులో బుధవారం రాత్రి ముస్లింలకు టీడీపీ ఇఫ్తార్ విందు ఇచ్చింది. పామర్రు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వర్ల కుమార్ రాజా ముఖ్య అతిథిగా హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి భోజనం వడ్డించారు. టీడీపీ నాయకులు వీరంకి వెంకట గురుమూర్తి, వీరపనేని శివరామ్‌ప్రసాద్, ఎంఎం దౌలా, పలు గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించలేని ప్రభుత్వమిది: కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, ఏప్రిల్ 3: "తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. దోచుకోవడం తప్ప దాహం తీర్చే ఆలోచన వైసీపీ ప్రభుత్వానికి లేదు. సమస్యను వైసీపీ ప్రభుత్వం పరిష్కరించలేకపోయింది. వైసీపీకి ప్రజలు ఓట్లేసే పరిస్థితి లేదు. టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తా. అని కూటమి పెడన అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం పెందుర్రులో కాగిత కృష్ణప్రసాద్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మూడు పార్టీల నాయకులు కలిసి పనిచేస్తామని, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాలతో పెడన నియోజకవర్గంలో జనసేన నాయకులు సైనికుల్లా పనిచేస్తున్నారని, తనకు మద్దతు ఇస్తున్నారని అన్నారు. గడప గడపకు తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాదరబోయిన ఏడుకొండలు, బాబ్జీ, నాగచంద్ర పాల్గొన్నారు.

దైవసేవకుల సంక్షేమం కోసం పనిచేస్తా



పెందుర్రులో ఓట్లను అభ్యర్థిస్తున్న కాగిత కృష్ణప్రసాద్

పెడన: దైవసేవకుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని టీడీపీ-జనసేన-బీజేపీ పెడన నియోజకవర్గ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ కాలనీలోని దావీదు చర్చిలో బుధవారం దైవసేవకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను, ఎంపీ అభ్యర్థి బాలశౌరిని ఆదరించి ఆశీర్వాదాలు అందజేయాలని కోరారు. చర్చిలో కృష్ణప్రసాద్ ప్రార్థనలు చేశారు. బొడ్డు వేణుగోపాలరావు, రెవరెండ్ బి.ఎస్.కిరణ్‌పాల్, ఉజ్జీవం, పరిశుద్ధరాజు, డానియేల్, ప్రభుదాస్, దావీదు, నియోజకవర్గ పరిధిలోని దైవసేవకులు పాల్గొన్నారు.

ఘంటసాల హైస్కూల్‌లో వృత్తి విద్యా కోర్సులు

ఘంటసాల, ఏప్రిల్ 3: జడ్పీ హైస్కూల్‌లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి వృత్తి విద్యా కోర్సులు ప్రారంభిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు జిల్లా బాలికా అభివృద్ధి అధికారి హెచ్.వనిత సూచించారు. బుధవారం పాఠశాలను ఆమె సందర్శించారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులకు విడిగా వృత్తి విద్యా కోర్సులు అమలు చేసేలా విద్యాశాఖ కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులైన ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ కోర్సులను ఈ ఏడాది నుంచి ప్రవేశపెడుతున్నామని వివరించారు. హెచ్‌ఎం శ్రీరంగవల్లి పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే: అర్జా నగేష్

పెడన రూరల్: బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేసిన పార్టీ టీడీపీ అని, బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్ అన్నారు. టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో బీసీ నాయకుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లతో విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో గుర్తింపు వచ్చిందని బీసీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బత్తిన దాను అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐక్యమత్యంగా ఉన్న బీసీ కులాలను విడదీసి నిర్వీర్యం చేసిందన్నారు. రానున్న ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. శలపాటి ప్రసాద్, పరసా కామేశ్వరరావు, పామర్తి వెంకటేశ్వరరావు, వేముల రాజేంద్రప్రసాద్, వీరంకి శ్రీను, జనసేన నాయకుడు పరమేశ్వరరావు పాల్గొన్నారు.

గుడివాడ సీటిస్తానని కాంగ్రెస్ మోసం చేసింది: శొంఠి బుజ్జి

గుడివాడ: నలభై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన తనకు గుడివాడ ఎమ్మెల్యే సీటు ఇస్తానని పార్టీ మోసం చేసిందని ఆ పార్టీ మాజీ పట్టణాధ్యక్షుడు శొంఠి దామోదరరావు(బుజ్జి) ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వలివర్తిపాడు రోడ్డులోని తన గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ కౌన్సిలర్‌గా కాంగ్రెస్‌కు సేవలు చేసిన తనకు 2019లో సీటు విషయంలో మోసం చేశారని, 2024లో ఇస్తానని మళ్లీ మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన అభిమానులు, శ్రేయోభిలాషులు పార్టీకి రాజీనామా చేయాలని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని కోరారని, నిర్ణయాన్ని ఉగాది నాడు ప్రకటిస్తానని ఆయన తెలిపారు.

లింగాల సుధాకరరావుకే పెడన సీటివ్వాలి

- కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుల డిమాండ్

పెడన, ఏప్రిల్ 3: పార్టీకి ఏళ్లతరబడి సేవలందిస్తున్న లింగాల సుధాకరరావును కాదని నియోజకవర్గంతో సంబంధం లేని బయట వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించడం సరికాదని, అధిష్టానం పునరాలోచించి స్థానికుడు, సమర్థుడైన సుధాకరరావును కాంగ్రెస్ పెడన అభ్యర్థిగా ప్రకటించాలని ఆ పార్టీ నాయకులు బుధవారం నిర్వహించిన నియోజకవర్గ సమావేశంలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సీహెచ్‌వీ అప్పారావు, చోడవరపు వెంకట అప్పారావు, ఆకురాతి జనార్దన్, జన్యావుల లీలాకృష్ణ, ఎం.ప్రసాద్, సిరివెళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

కాలువల నీరు చేపల చెరువులకు మళ్లింపు

- పట్టించుకోని అధికారులు

నందివాడ, ఏప్రిల్ 3: పంటకాలువల ద్వారా వచ్చే నీళ్లు చేపల చెరువులకే పరిమితమవుతున్నాయని పశువులకు కూడా నీళ్లు దొరకటం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అరకొరగా కాలువల ద్వారా నీళ్లు వదులుతుంటే కాలువలకు అడ్డంగా అడ్డీలు వేసి ఇంజన్ల ద్వారా కొందరు నీళ్లు తోడుతుంటే అధికారులు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేపల చెరువుల యజమానులు కాలువల్లో ఎక్కడ నీళ్లు కనిపించినా తోడేస్తున్నారని, వేసవికాలం పశువుల పరిస్థితి ఏంటి అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోసపాడు కాలువల ద్వారా నీళ్లు అరకొరగా వస్తుంటే ఆ నీళ్లు నందివాడ చివర వరకే పరిమితంగా వస్తున్నాయి. దోసపాడు కాలువ ద్వారా వస్తున్న నీటికి అడ్డీ వేసి చేపల చెరువులకు నీటిని తోడేస్తున్నారని అడ్డీలను తొలగించాలని కోరుతున్నారు.



నందివాడ శివారు దోసపాడు కాలువపై వేసిన అడ్డీ

నేటి నుంచి తాగునీటి చెరువులకు నీరు

గుడ్లవల్లేరు: పంచాయతీ తాగునీటి చెరువులకు కాల్వల ద్వారా ఈనెల 4వ తేదీ నుంచి 14వ తేదీవరకూ నీటిని సరఫరా చేస్తున్నామని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. తాగునీటి అవసరాలకే నీటిని పెట్టుకోవాలని, చేపలు, రొయ్యల చెరువులు నింపుకొంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రత్యేక హోదా సాధనే కాంగ్రెస్ లక్ష్యం

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 3: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి అందె శ్రీరామమూర్తి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నియోజకవర్గంలో 30 వేలు ఓట్లు సాధించడమే లక్ష్యంగా పని చేస్తానని, ఇందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన కోరారు.